క్లుప్తంగా

బాధ్యతతో పనిచేస్తే సమాజం గుర్తిస్తుంది

తాడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, విరమణలు సర్వసాధారణమని, బాధ్యతతో పనిచేస్తే సమాజం గుర్తిస్తుందని ఆర్డీఓ సురేష్ అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ప్రమిళ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆమెతో పాటు ఏఎస్ఓ జాకీర్ బదిలీపై వనపర్తి వెళ్లగా, పూలమాల, శాలువాలతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ మహ్మద్ అలీ, సిబ్బంది శ్రీధర్ రెడ్డి, మల్లేష్, ప్రీతమ్, బాలస్వామి, హరి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా చర్యలను స్వాగతిస్తున్నాం

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ద్వారా తీసుకుంటున్న చర్యలను తాము స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ తెలిపారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో చెరువులను ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమించి కట్టడాలు కడుతున్న విధానంపై చర్యలు తీసుకోవాలని ఎన్నో పోరాటాలు నిర్వహించామని, ప్రభుత్వం తీసుకుంటున్న విధానం తమకెంతో ఆనందం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, లక్ష్మయ్య, నిరంజన్ యాదవ్, శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అమ్రాబాద్: పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వంకేశ్వరం ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. హాస్టల్ పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని వర్కర్లకు తెలిపారు. వైద్యాధికారి సుధాకర్, వార్డెన్ సరస్వతి, వైద్య సిబ్బంది మల్లయ్య, మురళీధర్‌రావు, కృష్ణ, బిచ్చులు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

చారకొండ: గ్రామాల్లో విషజ్వరాల నివారణకు ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి శనివారం ప్రకటనలో కోరారు. 2న జిల్లా కేంద్రం డీహెంహెచ్ఓ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎల్లికల్‌లో వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్‌లో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులు ఉన్న వారు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలి



కల్వకుర్తిరూరల్: కార్యకర్తలు సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రాఘవేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. ఒక బూత్ పరిధిలో 200 మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. ఇటీవల బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన చందును సన్మానించారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, దుర్గా ప్రసాద్, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, రాంభూపాల్‌రెడ్డి, గంగాధర్, విజయ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రుణమాఫీ సర్వే

చారకొండ: రుణమాఫీలో కుటుంబ నిర్ధారణ లేక అనర్హులుగా ఉన్న వారిని అర్హులుగా నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. శనివారం మండలంలోని గోకారం, సిర్సనగండ్ల, చారకొండ రైతు వేదికల్లో నిర్వహించారు. రైతులు కుటుంబ నిర్ధారణ సర్వేలో పాల్గొని తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి తనూజరాజ్ తెలిపారు.



బొందలపల్లి శివారులో వరిపొలాల్లో చేరిన నీరు



నిండుకుండలా మారిన మంతటి గార్ల చెరువు



మంతటి వద్ద కాజ్‌వే మీదుగా పారుతున్న వరద



జిల్లా కేంద్రంలో వర్షపు నీటిలో ఇరుక్కున్న పాఠశాల బస్సు

కందనూలులో భారీ వర్షం

- నీట మునిగిన పంటలు
- ఆందోళనలో రైతులు
- అలుగుపారిన చెరువులు, కుంటలు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరపి లేని వర్షం కురిసింది. ఫలితంగా చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. సత్యసముద్రం, నాగసముద్రం, కేసరి సముద్రం, ఈదుల చెరువుతో పాటు మంతటి పరిధిలోని గార్ల చెరువు, వనపట్ల ఊరచెరువులు నిండుకుండల్లా మారాయి. మండల వ్యాప్తంగా దాదాపు 150 కుంటలు, నిండుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఎల్లికల్‌లో 15.3 మిల్లీమీటర్లు, బిజినేపల్లి మండలంలోని పాలెంలో 14.8, నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెరలో 14.3, నాగర్‌కర్నూల్‌లో 14.3, వెల్దండలో 13.5, పెద్దకొత్తపల్లిలో 13.5, తోటపల్లిలో 13.5, యంగంపల్లిలో 10, జటప్రోలులో 7.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. అమ్రాబాద్‌లో 61 మిల్లీమీటర్లు, అచ్చంపేట మండలంలో ఐనోలులో 55.8 మిల్లీమీటర్లు, పదర మండలంలో 50.8, అచ్చంపేట టౌన్‌లో 43.3, కోడేరులో 41.8, వటవర్లపల్లిలో 39, కొల్లాపూర్‌లో 36.3, కొండారెడ్డిపల్లిలో 28.5, తూడుకుర్తిలో 23.3, పెద్దముద్దునూరులో 23, పెద్దూరులో 22.8, కొండనాగులలో 20.0 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

నిలిచిన రాకపోకలు

బల్మూర్: మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న రుసుల చెరువు నిండి ప్రవహిస్తుండటంతో బాణాల–అచ్చంపేట వెళ్లే రహదారిలోని రాకపోకలు నిలిచి పోయాయి. ఈ ప్రాంతం నుంచి ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయరాదని రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు..

కొల్లాపూర్ రూరల్: ముక్కిడిగుండం సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ముక్కిడిగుండంకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వాగు వద్ద బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. పాలకులు స్పందించి త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పొంగి పొర్లుతున్న బావాయిపల్లి వాగు

కొల్లాపూర్: వర్షం కారణంగా కావలోనికుంట చెరువులోకి భారీగా నీళ్లు చేరుకున్నాయి. తూము నుంచి నీళ్లు బయటకు వెళ్లేందుకు అడ్డంకులు ఉండడంతో సమీప నివాస గృహాల వరకు నీళ్లు చేరాయి. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య, కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్ రహీంపాష చెరువును పరిశీలించారు. పొక్లెయిన్ పిలిపించి తూము కాల్వను శుభ్రం చేయించారు. దీంతో చెరువులో నీటిమట్టం తగ్గింది. వరిదేల చెరువు తూము కాల్వ, మూల వాగు ఉధృతంగా పారింది. చుక్కాయిపల్లి చెరువు, మల్లపురాజుకుంట చెరువులు అలుగు పారాయి. పట్టణంలోని అగ్రికల్చర్ ఆఫీస్ సమీపంలోని కాల్వలో చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచింది. మున్సిపల్ సిబ్బంది కాలువను శుభ్రం చేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో విరామం లేకుండా శుక్రవారం రాత్రి నుంచి వర్షం జోరుగా కురుస్తుంది. మండలంలోని రఘుపతిపేట, రామగిరి మధ్య కాజ్‌వేపై మోకాళ్ల లోతు నీరు పారింది.

లింగాల: మండలంలోని పద్మన్నపల్లికి ఇరువైపుల ఉన్న రెండు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. గూడెంచెర్వు, చీకటి చెరువు, లింగాల సమీపంలోని రెండు కుంటలు అలుగు పారుతున్నాయి. చెన్నంపల్లి వాగు భారీగా ప్రవహిస్తుంది.



కొల్లాపూర్‌లో చెత్త తొలంగింపు పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

కోడేరు: కోడేరు నుంచి పస్పుల వెళ్లే వాగు, బావాయిపల్లి నుంచి పెద్దకొత్తపల్లి వెళ్లే వాగు, ఖానాపూర్ నుంచి గంట్రావుపల్లి వాగు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ మట్టి మిద్దెలు, పాత ఇళ్లలో ఉండకూడదని సూచిస్తున్నారు.

అచ్చంపేట రూరల్: బస్టాండ్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే దారి పెద్ద చెరువులా తలపించింది. గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే ఉప్పునుంతల రోడ్డులో బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో కల్వర్టు వద్ద భారీ నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే వాహనాలకు అంతరాయం కలిగింది. మల్లకుంట వద్ద నీరు రోడ్డుపైకి వచ్చింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్చంపేట అతలాకుతలమైంది. 2013 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలను ప్రస్తుతం తలపిస్తోంది.

నీట మునిగిన పంటలు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో రైతులు సాగు చేసిన పంటలు నీట మునిగాయి. వరి పొలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పత్తి పంటల్లో నీరు చేరడం వల్ల ఏపుగా పెరిగిన చేళ్లు వర్షానికి దెబ్బతిన్నాయి. రోహిణి కార్తిలో సాగు చేసిన పత్తి పంటల్లో కాయలు మురిగిపోతుండగా పిందె, గూడ రాలి దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ వర్షాలు ఇలాగే కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు భయపడుతున్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఏకధాటిగా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. పత్తి, ఇతర పంటల్లో నీరు చేరుకుని నష్టపోతున్నాయని, పత్తి కాయలు నీటిలో మునగడంతో మురిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతసాగర్ ఊరచెరువు అలుగు పారుతుంది.

తాడూరు: దుందుబీ నది కురిసిన వర్షాలకు పారుతుంది. సిర్సవాడ వద్ద నది ఇరువైపుల ఒడ్డులను ఆకునుకుని పారుతుంది. గోవిందాయిపల్లి పెద్ద చెరువు అలుగు పారుతుంది.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పోతినేని చెరువు అలుగు పారుతుంది. బాచారం పెద్దచెరువు, పాతయాపట్ల చాకిరేవు చెరువు, వెన్నచెర్ల పెద్ద చెరువు అలుగులు పారుతున్నాయి.

మండలంలోని చంద్రసాగర్, చౌటపల్లి వాగుతో పాటు, పలు చెరువులు, కుంటలకు భారీగా వరద నీరు చేరుతోంది. అధికారయంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుంది.



అప్పాయిపల్లి మార్గంలో ప్రవహిస్తున్న చిన్నవాగు



అచ్చంపేట పట్టణం సాయినగర్ కాలనీలో ఇళ్ల సమీపంలో భారీగా చేరిన వరద నీరు



బల్మూర్‌లో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న బాణాల వాగు



అలుగు పారుతున్న గోవిందాయిపల్లి పెద్ద చెరువు



అచ్చంపేట మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చౌటపల్లి వాగు



తెలకపల్లిలో పత్తి చేనులో చేరిన వర్షపు నీరు



తెలకపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో చేరిన నీరు



ఆకునెల్లికుదురు వద్ద పారుతున్న దుందుభీనది



అలుగు పారుతున్న పాతయాపట్ల చాకిరేవు చెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాడుబడిన, కూలిపోవడానికి సిద్ధంగా ఉండే ఇళ్లను తక్షణమే ఖాళీ చేయించాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరించాలని సిబ్బందికి సూచించారు. 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లు 9182506144, 9705218820, 8341488798, 9505669595 సంప్రదించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ సలాం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నరేష్

సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి

చారకొండ: కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలను తరలివెళ్లాలని కోరారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే 8079201198, 9000121252 నంబర్లకు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు.

బీఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్‌యాదవ్, నాయకులు

కల్వకుర్తి టౌన్: బీఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని వెల్దండ సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్‌యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడింది చూస్తే హాస్యాస్పదంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఓ కౌన్సిలర్.. మాజీ ఎమ్మెల్యే శాంతాబాయి కాంపౌండ్‌తో పాటు, తన సొంత కుటుంబసభ్యులను భూములను కబ్జా చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సుద్దపూసల్లగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వ్యవసాయ మార్కెట్‌లో కందులు, వడ్ల కొనుగోలు కేంద్రాలలో అవకతవకలకు పాల్పడి రూ.కోట్లు గడించి ఇప్పుడు నీతి, నిజాయితీ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజాక్షేత్రంలో ఉండే నేనే పలు మార్లు ప్రత్యక్ష ఎన్నికలలో గెలిచి, ప్రజాసమస్యలను పరిష్కరించానని, అదే విలేకరుల సమావేశంలో మాట్లాడిన నాయకులు ప్రజల మధ్య లేకుండా తప్పించుకుంటూ తిరుగుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. మరోమారు ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడితే ప్రజలు విశ్వసించరని, ప్రజలు వారిపై దాడులకు దిగుతారన్నారు. సమవేశంలో కాంగ్రెస్ నాయకులు సంతుయాదవ్, శివ, నిజాం, ఇతరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు

లింగాల: గిరిజనుల తీజ్ ఉత్సవాలు మండల కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 9 రోజులు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు సీతల పూజలను నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. వేడుకలకు బంజారవాడలోని మేరమ్మ భవాన్ని అందంగా ముస్తాబుచేశారు. ఉత్సవాలకు ముఖ్యమైన మొలకల బుట్టలను ఏర్పాటు చేసి వివిధ రకాలైన విత్తనాలను వేశారు. రోజుకు ఒక తీరుగా పూజలు నిర్వహించిన అనంతరం చివరి రోజు మొలకల బుట్టలను నిమజ్జనం చేసి ఉత్సవాలను ముగిస్తారు. మండల కేంద్రంలో తీజ్ వేడుకలను మొదటి సారిగా నిర్వహిస్తున్నారు.



సీతల పూజలు చేస్తున్న బంజార పెద్దలు

బైక్‌ను ఢీకొట్టిన వాహనం: ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి టౌన్: వ్యక్తిగత పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న బైక్‌ను క్రూయిజర్ ఢీకొట్టిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని హరిహర టౌన్‌షిప్‌కు చెందిన దత్తు అతని కుమార్తె ధనలక్ష్మి బైకుపై వారి వ్యక్తిగత పనులు చూసుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న వెంకటేశ్వర ధర్మకాంట వద్ద శ్రీశైలం వెళ్తున్న క్రూయిజర్ వాహనం వారిని వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో దత్తు తలకు తీవ్ర గాయం కాగా, ధనలక్ష్మికి కాలు విరిగిపోయింది. ఇద్దరిని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

చెరువును తలపిస్తున్న రహదారి



తెలకపల్లి: మండలంలోని గౌరారం, తెలకపల్లి మధ్యన డబుల్ బీటీ రోడ్డు మంజూరై ఏడాది పూర్తయ్యింది. ఇటీవల బీటీ రోడ్డు వేసి పర్వతాపురం పల్లెబావుల వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం ఇరువైపుల పావు కిలోమీటర్ వరకు రోడ్డు వేయకపోవడంతో గుంతలు ఏర్పడి నీళ్లు చేరి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం కురిసిన వర్షానికి రోడ్డుపై గుంతలు ఏర్పడి నీళ్లు చేరి చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్డును పూర్తి చేయాలని కోరుతున్నారు.

వికలాంగుల లెక్క తీయాలి

మన్ననూర్: ప్రభుత్వం చేపట్టబోయే కుల గణనలో వికలాంగుల లెక్క కూడా తీయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2016లో వికలాంగుల హక్కుల చట్టం అమలు అయిన తర్వాత 21 రకాల వికలాంగుల లెక్క ఎక్కడ కూడా తేల్చలేదని, 1995 చట్టం ప్రకారం 7 రకాలనే లెక్కించినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కొల్లాపూర్‌లో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఎన్టీఆర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. విశ్వశాంతి వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో హర్షవర్ధన్‌రెడ్డి పనిచేశారన్నారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, సాంబశివుడుయాదవ్, రాజేష్, సురేందర్‌గౌడ్, పోతుల వెంకటేశ్వర్లు, యాదన్నగౌడ్, కట్టా శ్రీనివాసులు, కిషన్‌నాయక్, జాఫర్, హుజూర్ శ్రీనివాస్ యాదవ్, అహ్మద్‌ఘోరీ, రుక్మద్దీన్, కృష్ణమూర్తి, రాజుయాదవ్, హరికృష్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



తాడూరులో వ్రతం చేస్తున్న భక్తులు



పాలెం వెంకన్న ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు సిర్సవాడ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ఆవరణలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని సామూహిక వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. హోమాలు, అభిషేకాలు నిర్వహించి అన్నదానం చేపట్టారు.

పాలెంలో సామూహిక వ్రతాలు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి) : పాలెం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తులు పెద్దఎత్తున సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోరవి రామానుజాచార్యులు సత్యనారాయణస్వామి వారి వ్రతాలను భక్తుల చేత నిర్వహించారు. భారీ వర్షంలోనూ భక్తులు అత్యధికంగా రావడంతో ఆలయ పరిసరాలు రద్దీతో నెలకొంది.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోతేపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వెల్దండ: మండలంలోని పోతేపల్లి, పెద్దాపూర్‌లో శనివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ముసురు వర్షంలో ప్రజలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చారకొండ: మండల కేంద్రంలో శనివారం ముత్యాలమ్మ, పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అలకరించిన బోనాలతో ఉరేగింపుగా వెళ్లారు. గ్రామ దేవతలకు ప్రదక్షిణ చేసి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.



చారకొండలో బోనాలతో మహిళలు